# ఊహా సుందరి

రచన :
శ్రీమతి ఎస్. పద్మావతి

"మ్రోగింది వీణా పదే పదే హృదయాలలోనా" అంటూ రేడియోలో వస్తూన్న పాట స్థాయిని మించి హెచ్చుగానే పరవశంగా పాడుతోంది కలలు కనే వయసులోనున్న కల్యాణి.

"మనోరంజని ఇంతటితో సమాప్తం" అన్న గొంతు విన్పించటంతో, ఆ గొంతు నొక్కెయ్యాలన్నంత కోపంతో కసిగా 'టిక్' మని రేడియో ఆఫ్ చేసింది.

"ఏమండీ!" కొంచెం బిగ్గరగా విన్పించిన కంఠం విని ఉలిక్కిపడి అటువైపు చూసింది.

ఎవరో అపరిచిత యువకుడు కూలింగ్ గ్లాసెస్‌తో. "అబ్బ, వెరీ చార్మింగ్ ఫెలో, యద్దనపూడి హీరోలా వున్నాడు" అనుకుంది మనసులో. రాత్రెందుకో కూలింగ్ గ్లాసెస్, అదీ స్టయిల్ కాబోలు, అనుకుంటూ రెప్ప వాల్చకుండా చూస్తోంది.

"దశరథరామయ్యగారున్నారండీ" అన్నాడు. అప్పటికే ఎన్నోసార్లు పిలిచినా పలకని, కళ్యాణి ఇటువైపు చూడటంతో ఈ లోకంలోకి వచ్చిందని సంతోషిస్తూ—

"ఆఁ ఎవరూ! ఏమిటీ" అంది తడబాటుగా.

"బాఫ్ రే! ఏమిటీ అమ్మాయి" అనుకున్నాడతను.

"అదే దశరథరామయ్యగారిల్లు ఇదేనా? వారున్నారా? అన్నాడు.

అప్పటికి ఊహాజగత్తునుండి వాస్తవంలోకి వచ్చిన కళ్యాణి "ఆఁ ఉన్నారు, లేరండీ అలా వీధిలోకి వెళ్ళారు వస్తుండాలి ఈ పాటికి" అంది కంగారుగా.

"అమ్మయ్య, ఇప్పటికి మాట వచ్చింది నోట్లోంచి మహాతల్లికి," అనుకుంటూ 'కొంచెం మంచినీళ్ళిస్తారా?' అన్నాడు గొంతెండి పోతోంటే.

"ఆఁ తెస్తాను!" అంటూ వంటింట్లోకి నడవబోయిన కళ్యాణి, ఆ మధ్య శ్రీమతి వాసిరెడ్డిగారు రాసిన వ్యాసం గుర్తొచ్చి ఆగిపోయింది. అవును ఆవిడ రాశారు. కొందరు దొంగలు ఇలాగే మంచినీళ్ళిస్తారా అంటూ, మనమటు తిరగగానే లోపలికి జొరబడి తలుపులు మూస్తే?" ఆ ఊహాకే కాళ్ళూ చేతులు వణకసాగాయి చిరుచెమటలు పట్టాయి. తల వంచుకుని నిల్చుండి పోయింది ఒణికిపోతూ.

ఆ అమ్మాయి అంతర్యమేమిటో బోధపడలేదతనికి. చిరాకేసింది. "అక్కర్లేదులెండి, వస్తాను. నాన్నగారొస్తే ఈ లెటర్ ఇయ్యండి. నేనీ రాత్రి ట్రైన్‌కే వెళ్ళిపోతున్నాను. అడ్రసందులోనే వుంది, లెటర్ రాయమనండి" అంటూ గబగబా నడిచేడు బయటకి చేతిలో బ్రీఫ్‌కేస్‌తో.

"అమ్మయ్య బ్రతికించాడు" అనుకుంటూ తేలిగ్గా శ్వాసించి, చేతిలోనున్న కవరు వెనకవైపు తిప్పి చూసింది. "ఎం. అనిల్ కుమార్, డైరక్టర్ ఆఫ్ ఫిలిం ఇనిస్టిట్యూట్, మద్రాస్" అని వుంది.

"అరే! ఎంతపని చేశాను," అనుకుంటూ గబగబా వీధి గుమ్మంలోకి వెళ్ళి చూసింది. దూరంగా వీధి చివర కన్పించాడు. "ఏమండీ, అనిల్..." అంటూ బిగ్గరగా పిలిచింది, కానీ అప్పటికే వీధిమలుపు తిరగడంతో నిస్సహాయంగా నిలబడింది నిట్టూరుస్తూ.

"ఛి, ఛీ, ఎంతపని చేశాను. అసలు అనవసరంగా ఏవేవో ఊహించుకుని భయపడిపోయాను. నాన్నగారు త్వరగా వచ్చినా బాగుండును. స్టేషనుకు వెళ్ళి తీసుకువద్దును" అనుకుంటూ అదే ట్రైన్‌కి వెళుతున్నారో కూడ కనుక్కోలేని, తన తెలివితక్కువతనానికి తెగ బాధపడిపోతోంది.

అసలు కళ్యాణి ఇంత బాధపడిపోవడానికి కారణం వేరే వుంది. కల్యాణి నవలలూ, కథలూ చదివి, చదివి, ఒక బ్రహ్మాండమైన నవల రాసింది. మిత్రులకి చదివి వినిపించింది. "అద్భుతం! ఇదే సినిమాగా తీస్తే సెంచరీ కొట్టేస్తుంది గ్యారంటీ" అన్నారు.

ఇంతకీ, ఏ పత్రికకి పంపించాలా? అని ఆలోచించేరు అంతా కలిసి. 'లాభంలేదు, కొత్తవాళ్ళవి వేసుకోరు పత్రికలవాళ్ళు. ఇంత మంచి నవలని వేసుకోరు, సరికదా పేర్లు మార్చి, వాళ్ళ పేరుతో సినిమాకూడా తీసేస్తారు, అనుకున్నారు.

"నువ్వు వినలేదా ఆ మధ్య ఎవరో రచయిత్రి, తన

నవలే ఇంకో రచయిత్రి పేరు మీద రాయించి, సినిమా కూడా తీసేరని, కోర్టులో కేసుకూడా నడిచిందట." అంది నళిని ఇలాంటి వార్తల సేకరణలో దిట్ట అది.

వాళ్ళకి ఈ సంగతి చెప్తే తిడ్తారు తన తెలివితక్కువ తనానికి. అసలు తాను అతనిని కూర్చోమని, ఎందుకొచ్చావ్, ఏమిటో వివరాలు కనుక్కోవలసింది. పోనీ అతను ఏదైనా మర్చిపోయి మళ్లా తిరిగివస్తే బాగుండును. అనుకుంది ఆశచావక. అప్పటికే వందసార్లకు పైగా తను చేసిన పొరపాటుకు చింతిస్తూ.

తన అదృష్టం బాగుండి, అతను కనక తిరిగివస్తే, ఈసారి సమయం వృధాపుచ్చను. మాటల్లోకి దింపి, తను రాసిన నవల గురించి చెపుతాను. తప్పకుండా అతనికి నచ్చితీరుతుంది. అతను తెలిసిన నిర్మాత కెవరికైనా చెప్పి సినిమాగా తీయిస్తాడు. వస్తే బాగుండును అనుకుంటూ గేటు నానుకుని నిలబడింది వీధిలోకి చూస్తూ.

"ఏమండీ, నాన్నగారొచ్చారా?" అన్న గొంతు వినగానే—

"ఆఁ వచ్చారు, రండి కూర్చోండి, కాఫీ తెస్తాను. భోజనం చేస్తున్నారు" అంది సంభ్రమంగా.

చిన్నగా నవ్వుతూ స్టయిల్‌గా సోఫాలో కూర్చున్న తనని చూస్తూ "ఇందాక మంచినీళ్ళయినా ఇయ్యని అమ్మాయి ఇప్పుడు ఇంత చనువుగా ప్రవర్తిస్తోందేమిటని నవ్వుకుంటున్నాడా?" అనుకుంది కల్యాణి.

"కాఫీ తెస్తాను. అందాకా వీక్లీస్ చూస్తూ కూర్చోండి" అంటూ అతని చేతికో నాలుగు పత్రికలు ఇచ్చి లోపలికి నడిచింది. ఇంక డైరెక్టర్‌గా నవల మీదే సంభాషణ మొదలు పెట్టచ్చుననుకుంటూ.

కాఫీకప్పు తీసుకవచ్చి అతనికిస్తూ, చూసింది అతను చూస్తున్న పత్రిక పేజీ. అది సీరియల్ నడుస్తున్న పేజీ. ఫరవాలేదు. ఇతనికీ సీరియల్స్ అంటే ఇంట్రస్టు ఉన్నట్లుంది, అనుకుంది తృప్తిగా.

"ఏం, ఓయ్ ఎప్పుడొచ్చావ్" అన్నాడు దశరథరామయ్యగారు వంటింట్లోంచి బయటికివస్తూ. "అంతా బావున్నారా? ఏమిటి విశేషాలు" అన్నారు బట్టలు మార్చుకుంటూ.

నేనొచ్చి నాలుగు రోజులైందండి, ఏవో కంపెనీ పనులమీద తిరుగుతున్నాను. ఈ నైట్‌కే వెళ్ళిపోవలసింది. మిమ్మల్ని స్వయంగా కలిసి మాట్లాడాలని వుండిపోయాను అన్నాడు వినయంగా.

"అమ్మయ్య! నా అదృష్టం బాగుంది. తాపీగా నా నవల గురించి చర్చించవచ్చు" అనుకుంది సంతోషంగా.

LPC



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువుగా అతిప్రెషర్ లో సాదారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

______ : వివరములకు : ______

Grams: "NAIDUBROS" Phone: Office: 22409 Works; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002

"అమ్మాయ్, పరంధామయ్య రేపు టౌన్ వెళుతున్నాడట, మన ఇంటి విషయం ఏమయిందీ కనుక్కోమంటాను" అంటూ కూర్చోవోయ్, ఓ ఐదు నిముషాల్లో వచ్చేస్తాను, తీరిగ్గా మాట్లాడుకుందా! అంటూ బయటికి నడిచేడు.

"రక్షించావు! ఆ ఐదు నిముషాల్లోనే అంతా మాట్లాడుకోవచ్చు" ననుకుంటూ అతని ఎదురు కుర్చీలో కూర్చుంది.

ఎదురుగా కూర్చున్నా తల ఎత్తడేం మహానుభావుడు అనుకుంది విసుగ్గా తల వంచుకుని పుస్తకంలోకి చూస్తున్నతనిని చూస్తూ.

"ఏమండీ మీకు సీరియల్స్ అంటే ఇష్టమా?" అడిగింది సంభాషణ ప్రారంభిస్తూ.

"అబ్బే లేదండీ, ఊరికినే చూస్తున్నాను" అంటూ తడబడిపోయాడు.

"అంటే మీకు ఇంట్రస్ట్ లేదా?" అంది నీరసించిన కంఠంతో.

"అబ్బే అది కాదండీ చదువుతాను, కానీ" అంటూ ఆగాడు.

"ఐతే సీరియల్స్, కథలు చదువుతారా? ఏవి ఎక్కువ లైక్ చేస్తారు" అంది గబగబా ఉత్సాహంగా.

"చదువుతానండీ, కాని వెరైటీస్ లైక్ చేస్తానండి. ఐనా ఈ మధ్య వచ్చేవన్నీ ఒకదంపుడుగా ఒకేలా వుంటున్నాయండీ" అన్నాడు.

"మరి ఇప్పుడొచ్చే సినిమాల మీదభిప్రాయమేమిటండీ?"

"ఏమండీ, మీరేమైనా, ప్రెస్ రిపోర్టరా? లేక రైటరా?" అన్నాడు నవ్వుతూ.

సిగ్గుపడిపోతూ "ఏమలా అడుగుతున్నారు" అంది.

"అహఁ ఏంలేదు మీరడుగుతున్న ప్రశ్నలు చూసి" అన్నాడు.

"లేదండీ, ఊరికే ఇంట్రస్ట్" అంది.

"మీరేమైనా పిక్చరు డైరక్ట్ చేశారాండి?" అంది మళ్ళీ ప్రశ్నిస్తూ.

"లేదండీ, చాలా ఆఫర్స్ వచ్చాయి డైరక్షన్ చేయమని. కానీ నేనే ఓ పిక్చర్ తీద్దామనుకుంటున్నాను. మాంచి వెరైటీ వున్న స్టోరీ దొరికితే ప్రారంభిద్దామని చూస్తున్నాను" అన్నాడు.

"కల నిజమాయెగా, కోరిక తీరెగా" అన్నపాట బిగ్గరగా పాడేసుకోబోయి, ఎదురుగా అతనుండటంతో ఆ కోరికను వాయిదా వేసుకుంది.

"ఏమండీ, మీరేదైనా వెరైటీ నవల సజెస్ట్ చేయండి సినిమా తీద్దాం" అన్నాడు.

(సశేషం)

ఎల్లప్పుడూ "జీబ్రా" బనియన్లనే ఉపయోగించండి!!

Always use Zeebra BANIANS

ఎందుకనగా...

అవి, కరెక్ట్‌సైజు, చక్కని అల్లిక, దీర్ఘకాలమన్నిక.

మా తయారింపులు :—

♦ ఫాంటా ♦ రాజు

♦ జీబ్రా ♦ జుల్లీట్

: తయారించువారు :

TEL : "ZEEBRA" PHONE : 21686

Zeebra Hosieries

LAKHSMINAGAR MAIN ROAD :: TIRUPUR-638 602